సాక్షి
అనంతపురం
ఆదివారం । 12 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/12.9°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా మండలాల్లో చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

మరో 2 వేల హెక్టార్లకు డ్రిప్ అవకాశం



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: మరో రెండు వేల హెక్టార్లకు సరిపడా డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుంపర) ఇవ్వడానికి అవకాశం ఉందని ఏపీఎంఐపీ జిల్లా అధికారి జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డితో కలిసి ఇరిగేషన్ కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లు, హెచ్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాకు నిర్దేశించిన 11 వేల హెక్టార్ల లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించామన్నారు. 2,120 హెక్టార్లకు స్ప్రింక్లర్లు, 9,890 హెక్టార్లకు డ్రిప్ యూనిట్లు ఇచ్చామన్నారు. 9 వేల మందికి పైగా రైతులకు ఈసారి పరికరాలు మంజూరు చేశామని తెలిపారు. అయితే ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నందున కనీసం 2 వేల హెక్టార్లకు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ ఫక్కీరప్ప కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేస్తూ పలు, సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్లు,, ఐపాడ్, ట్యాబ్‌లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ కేంద్రంలోనికి తీసుకువెళ్లడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవ్వరూ రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం గానీ చేయరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదని, పోలింగ్ బూత్‌లోని దృశ్యాలను ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపే ఎమ్మెల్సీ పోలింగ్

- ప్రచారం పరిసమాప్తం
- 13న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- నేడు జేఎన్‌టీయూలో పోలింగ్ సామగ్రి పంపిణీకి చర్యలు
- ఇక ఓటు కోసం ఏ పద్ధతిలో ప్రచారం చేసినా ఉల్లంఘనే..

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ప్రక్రియ ఈ నెల 13న జరగనుంది. పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 3,30,124 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 28,148 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది.

నిర్వహణకు సిబ్బంది ఇలా..

అనంతపురం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు 546 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 101 మంది రిజర్వులో ఉంటారు. పోలింగ్ నిర్వహణకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి (పీఓ), ఒక పీఓ-1, ఒక ఓపీఓ-1, ఒక ఓపీఓ-2 ఉంటారు. పట్టభద్రులకు సంబంధించి 84 పోలింగ్ కేంద్రాలకు 407 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 71 మంది రిజర్వులో ఉంటారు. ఉపాధ్యాయులకు సంబంధించి 33 పోలింగ్ కేంద్రాలకు 139 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 30 మంది రిజర్వులో ఉంటారు.

పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్

జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. అదే విధంగా సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్ల)ను నియమించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో వీడియో చిత్రీకరణ ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే కేసు నమోదు చేస్తారు.

నేడు సామగ్రి పంపిణీ

పోలింగ్ సామగ్రిని పోలింగ్ కేంద్రాల వారీగా ఆదివారం అనంతపురంలో పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం జేఎన్‌టీయూ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.



బ్యాలెట్ పెట్టెలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు ఇలా..

జిల్లా	పట్టభద్ర ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	ఉపాధ్యాయ ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
కర్నూలు	61,633	74	5,391	27
నంద్యాల	54,929	61	4,426	15
అనంతపురం	68,341	84	5,464	33
శ్రీసత్యసాయి	43,310	54	3,348	32
వైఎస్సార్	81,317	93	7,461	38
అన్నమయ్య	20,594	22	1,958	30
మొత్తం	3,30,124	388	28,148	175

పోలీసు బందోబస్తుతో సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేరుస్తారు.

ప్రచారం బంద్

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 4 గంటలకు ముగిసింది. తదుపరి అభ్యర్థులు ఏ పద్ధతిలోనూ ప్రచారం చేయకూడదు. తమకు ఓటు వేయాలంటూ ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, సామాజిక మాధ్యమాలు, ఇతర పద్ధతుల ద్వారా అభ్యర్థులు ప్రచారం నిర్వహించకూడదు. అభ్యర్థులు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) చూపించాలి. ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో ఆధార్, పాస్‌పోర్టు, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి సర్వీస్ గుర్తింపు కార్డు, సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డు, డిగ్రీ లేదా డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించి ఓటు వేయవచ్చు.

పోలింగ్ రోజున సెలవు లేదు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన సంస్థలకు మాత్రమే సెలవు ఉంటుంది. ఇతరులకు సెలవు ఉండదు. అయితే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉద్యోగులకు స్పెషల్ కాజ్యువల్ లీవ్ (స్పెషల్ సీఎల్) సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.

భద్రత కట్టుదిట్టం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు భద్రత కల్పించే క్రమంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం జేఎన్‌టీయూ కళాశాలలో చేపట్టిన ఏర్పాట్లను ఎస్పీ ఫకీరప్పతో కలిసి పరిశీలించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కౌంటర్, పార్కింగ్ ప్రదేశాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతి అంశంలోనూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు వద్ద చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఏమి చేయాలి, ఏమి చేయకూడదనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏజెంట్ల వివరాలివ్వండి

కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఆర్ఓ గాయత్రీదేవితో కలిసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజవర్గాల నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులతో కలెక్టర్ నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. గడువు ముగిసిన తర్వాత నేరుగా ఓటర్లను కలవడం, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు, మొబైల్‌కు మెసేజ్‌లు, సోషల్ మీడియాలో ప్రచార పోస్టులపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్ ఏజెంట్ల వివరాలను ఈ నెల 14లోపు ఇవ్వాలని చెప్పారు.

పటిష్ట ఏర్పాట్లు చేశాం



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీకి 84 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాము. పోలింగ్ నిర్వహణకు 546 మంది సిబ్బందిని నియమించాం. బందోబస్తుకు 1,100 మంది పోలీసులు వినియోగిస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేశాం. సూక్ష్మ పరిశీకులను నియమించాం. కేంద్రం ఆవరణలో వీడియో చిత్రీకరణ ఉంటుంది. పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్‌తోనే బ్యాలెట్ పేపర్‌పై మార్కింగ్ వేయాలి. అంకెల్లో ఓటును ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులకు ఓటు వేయొచ్చు. అయితే మొదటి ప్రాధాన్యత అంకె వేస్తేనే ఓటు చెల్లుబాటవుతుంది.

– మీడియాతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి.

జంట హత్యల కుట్ర భగ్నం

- అమెరికా నుంచి అనంతపురం వచ్చి స్కెచ్
- రూ.58 లక్షలకు సుపారీ ఇచ్చిన మహిళ
- రిమాండ్‌కు నిందితుల తరలింపు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జంట హత్యల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఆస్తి వివాదం నేపథ్యంలో వరుసకు అల్లుడైన వ్యక్తిని, అతడికి సహకరిస్తున్న మరొక బంధువును అడ్డు తప్పించేందుకు ఓ మహిళ వేసిన స్కెచ్‌ను పోలీసులు పసిగట్టి.. సకాలంలో చెక్‌పెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం టూటౌన్ సీఐ శివరాముడు శనివారం మీడియాకు వెల్లడించారు. అనంతపురానికి చెందిన సారెడ్డి శారదకు తాతల కాలం నాటి ఆస్తుల్లో ఎక్కువ శాతం విలువైన భూములు వచ్చాయి. ఈ విషయమై దాయాదుల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఆస్తి పంపకాల్లో తమకు అన్యాయం జరిగిందని శారదకు వరుసకు అన్నకొడుకు అయిన రాజశేఖరరెడ్డి కోర్టును ఆశ్రయించాడు. ఈ విషయంలో పలుమార్లు ఇరుకుటుంబాల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. రాజశేఖర్ రెడ్డి కోర్టును ఆశ్రయించి ప్రతిసారీ ఇబ్బంది పెడుతున్నాడని అత్త శారద పగతో రగిలిపోయింది. ఎలాగైనా అతడి అడ్డు తొలగించుకోవాలని చూసింది.

అమెరికా నుంచి అనంతకు వచ్చి..

సారెడ్డి శారద భర్త, పిల్లలు, కుటుంబం మొత్తం అమెరికాలో స్థిరపడింది. కాగా ఈ ఆస్తి విషయంలో అన్నదమ్ములకు తోడుగా నిలవాలనుకుంది శారద. తమ కుటుంబానికి తలనొప్పిగా మారిన రాజశేఖరరెడ్డి, బంధువు సంతోష్‌రెడ్డిలను మట్టుబెట్టాలనుకుంది. అందులో భాగంగా ఇటీవల పులివెందులకు వచ్చిన ఆమె స్థానికంగా అనంతపురం జిల్లాకు చెందిన శ్రీకాంత్‌ను కలిసింది. రాజశేఖరరెడ్డి, సంతోష్‌రెడ్డిలను హత్య చేయాలని, ఇందుకుగాను రూ.58 లక్షలకు సుపారీ (కిరాయి) కుదుర్చుకుంది. అడ్వాన్స్‌గా రూ.8 లక్షలు ఇచ్చింది. కిరాయి ముఠా సభ్యులు శ్రీకాంత్, పఠాన్ టోఫీ వలిఖాన్, పుత్తూరు పాండులు ఒప్పందం ప్రకారం జంట హత్యలకు రంగం సిద్ధం చేసుకుని అనంతపురం శివారులోని ప్రసన్నాయపల్లి సమీపంలో వేచి ఉన్నారు. వీరిని కలిసేందుకు శారద కోర్టు రోడ్డు సమీపంలోని రైలు పట్టాల వద్ద ఎదురు చూస్తోంది. వీరి వ్యవహారంపై అనుమానం వచ్చి పోలీసులు ఆరా తీయగా.. జంట హత్యలకు పన్నిన కుట్ర బయటపడింది. దీంతో ఏక కాలంలో శారదతో పాటు కిరాయి ముఠా సభ్యులు శ్రీకాంత్, పఠాన్ టోఫీ వలిఖాన్, పుత్తూరు పాండును అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచి.. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

గరుడ వాహనంపై ఖాద్రీశుడు



కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజైన శనివారం ఖాద్రీశుడు గరుఢారూఢుడై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ... ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహునికి వాహనంగా మరోసారి పంపుతారని, దీన్నే ప్రజా గరుడసేవ..మలి గరుడసేవ అని కూడా అంటారని అర్చకులు వివరించారు. మోహినీ ఉత్సవంలో భాగంగా శ్రీవారు శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ గ్రామంలో ఊరేగారు. శనివారం రాత్రి 7 గంటలకు ఆలయానికి చేరుకున్న శ్రీవారికి అర్చకులు నిత్యపూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి గరుడవాహనంపై తిరువీధుల్లో విహరించారు. పెద్ద సంఖ్యలో రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తాదులు తమ ఇలవేల్పును దర్శించుకుని తరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవారు తెల్లటి ఐరావతం(గజవాహనం) పై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సొంత గ్రామాన్ని మరచిపోకూడదు

కూడేరు: ఎంత ఎదిగినా, ఉద్యోగ, వృత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ పుట్టి, పెరిగిన సొంత గ్రామాన్ని ఎప్పటికీ మరచిపోకూడదని హైకోర్టు జడ్జి బండారు శ్యాంసుందర్ పేర్కొన్నారు. శనివారం తన సొంత గ్రామమైన కూడేరుకు ఆయన కుటుంబ సమేతంగా వచ్చారు. బంధువులు, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. తర్వాత అంతరగంగలో ఉన్న తమ భూముల వద్దకు వెళ్లి పంటలను పరిశీలించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు.




కూడేరులో బంధువులతో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి బండారు శ్యాంసుందర్

నెట్టికంటుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

గుంతకల్లు రూరల్: హైకోర్టు జడ్జి బి.శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. జడ్జి కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

దిగజారుడు రాజకీయం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ డీలా..
- పీడీఎఫ్ అభ్యర్థి తరఫునా ప్రచారం చేస్తున్న వైనం
- తమ అభ్యర్థి ఓటమి ఖరారైందన్న టీడీపీ నాయకులు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఎదుర్కోలేక సీపీఐతో దోస్తీ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తొలుత బరిలో మేమున్నాం అంటూ జబ్బలు చరిచిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు బొక్క బోర్లా పడింది. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేమని రూఢీ అయ్యాక కాడిని కిందేశారు. కమ్యూనిస్టులతో పరస్పర సహకారానికి తెర తీశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శనివారం ఉరవకొండలో మీడియాతో మాట్లాడుతూ అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఓటమే ధ్యేయంగా టీడీపీతో కలిసి పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. మొన్న శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే, కమ్యూనిస్టులు బలపరుస్తున్న పీడీఎఫ్ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేయండంటూ అభ్యర్థించారు. టీడీపీ, సీపీఐ కుమ్మక్కు రాజకీయం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి

ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట అనేవారు. అలాంటిది 2019 సాధారణ ఎన్నికల్లో 14 ఎమ్మెల్యే సీట్లకు 12 సీట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెల్చుకుంది. దీంతో కంచుకోటలన్నీ బీటలు వారాయి. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనుండగా...దానికి రిహార్సల్స్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలంటూ ముందు చెప్పి.. ఇప్పుడేమో కాడిని కిందేయడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండు సీట్లలోనూ విజయ ఢంకా మోగించాలని...

వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేశాయి. గత పదిరోజులుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అలుపెరగని ప్రచారం చేశారు. జనంలో మమేకమయ్యారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించగలిగారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన వైనాన్ని ఆధారాలతో చూపించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం నల్లేరుమీద నడకే అని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు.

క్లుప్తంగా

జనావాసాల్లోకి చిరుతలు!



గుట్టపై సంచరిస్తున్న చిరుతలు

కళ్యాణదుర్గం: స్థానిక బలిజ కల్యాణమంటపం సమీపంలోని జనావాసాల్లోకి శనివారం ఉదయం 6 గంటలకు రెండు చిరుతలు ప్రవేశించి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. కల్యాణ మంటపం శివారులను ఉన్న గుట్టపై నుంచి చిరుతలు కాలనీలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. జనావాసాల్లోకి వచ్చిన చిరుతులను గమనించిన స్థానికులు వెంటనే ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఓ ఇంటి వద్ద ఉన్న పెంపుడు కుక్కలను చిరుతలు నోట కరుచుకుని వెళ్లాయి. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. వారం రోజులుగా తరచూ రాత్రి వేళల్లో వీధుల్లో చిరుతలు సంచరిస్తున్నాయని ఈ సందర్భంగా స్థానికులు వివరించారు. జనావాసాల్లోకి చిరుతలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, సమాచారం అందుకున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. రేంజ్ ఆఫీసర్ రాంసింగ్ ఆదేశాలలో చిరుతల ఆచూకీ కోసం గుట్టపై శనివారం సాయంత్రం సెక్షన్ ఆఫీసర్ షనవాజ్, బీట్ ఆఫీసర్ నాగేనాయక్, సిబ్బంది గాలింపు చేపట్టారు. జనావాసంలోకి చిరుతలు చొరబడకుండా గుట్టకు ఓ వైపు వలను ఏర్పాటు చేశారు. బోనులు ఏర్పాటు చేసి చిరుతలను బంధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఉగాది సేవా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: వివిధ రంగాలలో ప్రతిభ కనబరుస్తున్న వారికి శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఆల్ ది బెస్ట్ అకాడమీ' ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ లోపు 'సర్వేజన సుఖినో భవంతు, డోర్.నం. 1-20-103, 1వ అంతస్తు, తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, సికింద్రాబాదు-15' చిరునామాకు పంపాలి. అర్హులైన వారికి ఈ నెల 26న హైదరాబాదులో జరిగే కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తారు. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

అల్లా మార్గం అనుసరణీయం

- అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా స్థాయి ఇస్తెమా



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అల్లా మార్గం అనుసరణీయమని మౌలానాలు దావూద్, ఇర్ఫాన్, నిసార్, జమాలుద్దీన్ అన్నారు. అనంతపురం నగర శివారులోని ఆటో నగర్ వేదికగా జిల్లా స్థాయి ఇస్తెమా శనివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రమైంది. విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులతో పాటు నగర పాలక సంస్థ, రాప్తాడు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విభాగాలుగా వలంటీర్లను ఏర్పాటు చేసిన సహకరిస్తున్నారు. వజూ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. భోజనాలు, నీళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అల్లా కృపతో అన్నీ సాధ్యం

బెంగుళూరు, హిందూపురం, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఉలెమాలు ఆధ్యాత్మిక ప్రసంగం కొనసాగిస్తూ.. అల్లాహ్ కృప ద్వారా ఇహ, పర లోకాల్లో అన్నీ సమకూరుతాయన్నారు. అయితే అహం మనిషిని అన్ని విధాలుగా నష్టపరుస్తుందని, ఇందుకు ముస్లిం మత గ్రంథాల్లో పేర్కొన్న సులేమాన్ అలైహిస్సలాం కథనమే నిదర్శనమన్నారు. 'ప్రపంచంలోనే తనను మించిన గొప్ప ధనవంతుడు లేనే అహంతో సులేమాన్ అలైహిస్సలాం.. ఈ లోకంలో ఉన్న వారందరికీ ఆహారాన్ని అందించాలనుకున్నాడు. అయితే ఆయన వండించిన ఆహారం మొత్తాన్ని సముద్రంలోని ఓ చేప రెండు ముద్దల్లో తినేసింది. అనంతరం ఆ చేప ఆయనతో మాట్లాడుతూ.. తనకు అల్లా కృపతో ఇలాంటి ఆహారం కడుపు నిండా మూడుపూటలా అందుతోందని తెలిపింది. ఇది విన్న రాజులోని అహం నశించి, అల్లా తలుచుకుంటే ఏదైనా సమకూరుతుందని, తాను కేవలం నిమిత్తమాత్రుడేనని గ్రహించి, సమస్త జీవరాశి అభ్యున్నతికి పాటు పడుతూ వచ్చారు'. ఈ కథనంలో దాగున్న రహస్యాన్ని గ్రహించి అహం వీడి అల్లా మార్గంలో నడవాలని ఉలెమాలు పిలుపునిచ్చారు.

శాంతికి చిహ్నం ఇస్లాం

ఇతరులను ఇబ్బందులకు గురి చేయడం, ఆస్తిని, ఇతర వస్తువులను లాక్కోవడాన్ని ఇస్లాం పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఉలెమాలు అన్నారు. శాంతికి చిహ్నం ఇస్లాం అనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అల్లాహ్ ఆదేశాల మేరకు మహమ్మద్ ప్రవక్త సాగించిన బోధనలను ప్రతి ముస్లిమూ తప్పనిసరిగా పాటించాలన్నారు. భక్తి మార్గంలో నడుస్తూ క్రమం తప్పకుండా నమాజు చేయడం, ఇతరులకు సాయం చేయడం ఇస్లాం సిద్ధాంతమన్నారు. అల్లా ఆదేశం లేనిదే ఈ సృష్టిలో ఏదీ జరగదన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అల్లాహ్ గొప్పతనాన్ని ప్రశ్నించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అమీర్‌సాబ్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రీడా హబ్‌గా అనంతపురం జిల్లాను తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలూ చేపట్టినట్లు ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి తెలిపారు. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆల్ ఇండియా జోనల్ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిప్పేస్వామి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. క్రీడలకు ప్రత్యేక కేంద్రంగా ఆర్డీటీ మారిందన్నారు. జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టును విజేతగా నిలపడంలో ఆర్డీటీ ప్రధాన భూమిక వహించడం గర్వకారణమన్నారు. ఈ క్రమంలో ఆయా జోన్లలో విజేతలుగా నిలిచిన పురుషుల, మహిళల జట్లకు జాతీయస్థాయిలో టోర్నీ నిర్వహణకు వేదకగా మారడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇలాంటి టోర్నీలు దోహదపడతాయన్నారు. క్రీడాభివృద్ధికి ఆర్డీటీ చేపట్టిన చర్యలకు గుర్తింపుగా రాష్ట్రపతి అవార్డు దక్కిందన్నారు. అనంతరం సీనియర్ పీడీ కొండారెడ్డి, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాతీయ సీఈఓ ప్రవీణ్ అనౌకర్, ట్రెజరర్ శ్రీకాంత్ థోరట్, ఏపీ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు కేశవమూర్తి, గోపాలరెడ్డి, రామకృష్ణ, ప్రభాకర్, ఫక్కీరప్ప, లతాదేవి, ప్రసాద్, శ్రీకాంతరెడ్డి, శోభన్‌బాబు, ఆర్డీటీ స్టేడియం మేనేజర్ శ్రీదేవి, సర్జిత్ సింగ్, గ్రాస్‌రూట్ లెవల్ కో-ఆర్డినేటర్ ఓబులేసు, సంజీవన్, సీనియర్ క్రీడాకారులు బద్రి, సాయి త తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మ్యాచ్‌ల పురుషుల విభాగంలో నార్త్ జోన్ జట్టుపై 8-0 పాయింట్ల తేడాతో సౌత్ జోన్ జట్టు, ఈస్ట్ జోన్‌పై 10-0 పాయింట్ల తేడాతో వెస్ట్ జోన్ జట్టు విజయం సాధించాయి. అలాగే మహిళల విభాగంలో నార్త్ జోన్‌పై 7-0 పాయింట్ల తేడాతో సౌత్‌జోన్ జట్టు గెలుపొందింది.

యువతకు ఉపాధి కల్పన సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



శింగనమల: యువతకు ఉపాధి కల్పించడంలో దేశంలోనే అగ్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో 6.7 లక్షల ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉద్యోగాల కల్పన వెల్లువలా సాగిందన్నారు. పరిశ్రమలలో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించారన్నారు. పెట్టుబడుల సాధన, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాల అమలు, డీబీటీ రంగాల్లో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరినట్లు వివరించారు. దీంతో యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు గుర్తుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీకి డబుల్ డిజిట్ కూడా దక్కదు

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న హరీష్‌కుమార్‌యాదవ్

గుత్తి: రాబోవు సాధారణ ఎన్నికల్లో టీడీపీకి డబుల్ డిజిట్ సీట్లు కూడా దక్కవని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ అన్నారు. గుత్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 సాధారణ ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మున్సిపల్, ఉప, ఇతర ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. ఇదే ఒరవడి రాబోవు సాధారణ ఎన్నికల్లోనూ ఉంటుందన్నారు. ఎల్లో మీడియా అవాస్తవ కథనాలు రాసినా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, అచ్చెన్నాయుడు ఎన్ని కుట్రలు, కుంత్రాలు చేసినా అన్నింటినీ ప్రజలు సమర్థవంతంగా తిప్పి కొడతారన్నారు. ఆఖరుకు కుప్పంలో చంద్రబాబు సైతం ఓటమి పాలవడం ఖాయమన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు కూడా ఓటర్లకు తెలియవని, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా రామచంద్రా రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ యాదవ్, జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్ యాదవ్, రాజకుమార్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బుసా సుధీర్‌రెడ్డి, తొండపాడు ఆలయ పాలక మండలి చైర్మన్ రామాంజి రాయల్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



రాఘువేంద్రరెడ్డి (ఫైల్)

తాడిపత్రి: మండలంలోని ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఉద్యోగి రాఘవేంద్రరెడ్డి (27) శనివారం తెల్లవారు జామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందా డు. పట్టణంలోని నందలపాడుకు చెందిన రాఘవేంద్రరెడ్డి శుక్రవారం రాత్రి 'సి' షిఫ్ట్‌లో భాగంగా విధులకు హాజరయ్యాడు. వేకువ జామున ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడి వైద్య సిబ్బంది స్పందించి ఆగమేఘాలపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయాన్ని శనివారం తెల్లవారుజామున మృతుడి కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఘటనపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ మృతుడి భార్య మంజుల ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, రాఘువేంద్రరెడ్డి మృతిపై తమకు న్యాయం చేయాలంటూ మంజుల తన ఇద్దరు చంటి బిడ్డలను ఎత్తుకుని, బంధువులతో కలసి శనివారం ఉదయం ఆర్జాస్ స్టీల్ ప్లాంట్ ఎదుట ఆందోళనకు దిగింది. ఆందోళనకు సీపీఐ నాయకులు మద్దతు పలికారు. నాయకులు రంగయ్య, నాగరంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ చిన్నపెద్దయ్య, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిశ్రమ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని యాజమాన్యం భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

● మహాద్భుతం.. రామకోటి వస్త్రం



రామాయణ ఘట్టాలతో కూడిన పట్టు వస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ మధుసూదన్, తదితరులు

రాప్తాడు/అనంతపురం కల్చరల్: వినూత్న అంశాలతో పట్టు వస్త్రాలను నేసి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న ధర్మవరం చేనేత కళాకారులు.. మరో అద్భుతాన్ని ఆవిష్కరించారు. 18 గజాల పొడవుతో నేసిన పట్టు వస్త్రం బార్డర్‌లో రామాయణంలోని అపురూప సన్నివేశాలను, వస్త్రం మధ్యలో జైశ్రీరామ్ అంటూ మొత్తం 32,200 పదాలను అద్భుతంగా నేశారు. నేత్రపర్వమైన ఈ రామకోటి వస్త్రాన్ని ధర్మవరానికి చెందిన చేనేతలు పల్లా సురేంద్రనాథ్, పల్లా తేజ, జూజారు నాగరాజు.. నెల రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. వాల్మీకి రామాయణంలోని బాల కాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కిధకాండ, సుందర కాండ, యుద్ధ కాండలలోని ప్రధాన ఘట్టాలు కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించారు. రూ.75 వేలు విలువ చేసే ఈ వస్త్రాన్ని హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వస్త్రాన్ని మూలవిరాట్‌కు అలంకరించిన అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు ఈశ్వరయ్యస్వామి, ఆలయ చైర్మన్ మధు మాట్లాడుతూ.. సంపూర్ణ రామకోటి వస్త్రంతో ఆలయానికి మరింత శోభ చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చేనేత కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో రాప్తాడు తహసీల్దార్ నరసింహులు, విశ్వనాథ్, ఆర్‌ఐ దివాకర్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల వివరాలు కోరిన సర్కారు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో ఆయా శాఖధిపతులు ఇప్పటికే తమ శాఖల్లో ఖాళీ పోస్టుల వివరాలతో సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. మిగిలిన శాఖాధిపతులు కూడా ఒకట్రెండు రోజుల్లో జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపే పనిలో నిమగ్నమై ఉన్నారు.

తల్లిదండ్రులూ అప్రమత్తంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

రాప్తాడు రూరల్: పదో తరగతి పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలని, ఈ విషయంగా అప్రమత్తంగా వ్యవహరించాలని తల్లిదండ్రులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం సూచించారు. అనంతపురం నగరంలోని కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ నంబర్-2 ఉన్నత పాఠశాల శనివారం టీచర్లు, తల్లిదండ్రుల సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా డీఈఓ సాయిరాం హాజరై, మాట్లాడారు. పరీక్షల్లో పిల్లల ఉత్తీర్ణతకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థి జీవితంలో అమూల్యమైన ఈ సమయాన్ని వృథాకానివ్వరాదని కోరారు. సమావేశంలో అనంతపురం డీవైఈఓ పద్మప్రియ, హెచ్‌ఎంలు, ఏపీఓ మారుతి పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌కు ఇద్దరి సరెండర్

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో నకిలీలా బాగోతంపై కలెక్టర్ నాగలక్ష్మి ఆరా తీశారు. 'నకిలీల్లో టెన్షన్' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. 2020-21లో కరోనా అత్యవసర పరిస్థితుల్లో కాంట్రాక్ట్ పద్ధతిన వివిధ సాంకేతిక విభాగాల్లో చేరిన మొత్తం ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం. కృష్ణవేణికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని పలు ఆస్పత్రుల హెచ్‌ఓడీలకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో జిల్లాలోని ఓ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అనుమానితులను డీసీహెచ్ఎస్‌కు సరెండర్ చేసినట్లు సమాచారం.

పోలీసు స్పందన రద్దు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 13న జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ మేరకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రథోత్సవం ఈ నెల 13న (సోమవారం) జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ భవ్యకిశోర్ తెలిపారు. పులివెందుల వైపు నుంచి బెంగళూరు వెళ్లాల్సిన వాహనాలను కుటాగుళ్ల, మలకవేముల క్రాస్ మీదుగా ఓడి చెరువువైపు మళ్లించామన్నారు. అలాగే బెంగళూరు వైపు నుంచి విచ్చేసే భక్తుల వాహనాలను హిందూపురం రోడ్‌లో వ్యవసాయ పరిశోధనా స్థానం వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. పులివెందుల, అనంతపురం వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో హైదరాబాదీ మృతి



మృతుడు నిఖిల్‌యాదవ్

గుత్తి రూరల్: లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని ప్రేమావతి పేటకు చెందిన నిఖిల్ యాదవ్ (24), రాజేష్... సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వీకెండ్ సెలవును బెంగళూరులో ఎంజాయ్ చేసేందుకు తమ స్పోర్ట్స్‌బైక్‌పై శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో బయలుదేరిన వీరు... మధ్యాహ్నం గుత్తి మండలం వన్నేదొడ్డి శివారులో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వెళుతున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అటుగా వచ్చిన కారును ఆపి తీవ్రంగా గాయపడిన నిఖిల్, రాజేష్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోపు నిఖిల్ యాదవ్ మృతిచెందాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రాజేష్‌ను అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుత్తి పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కత్తులతో దాడి



శ్రీనివాసరెడ్డి వీపులో చిక్కుకున్న కత్తి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆస్తి వివాదం నేపథ్యంలో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా ముద్దనూరుకు చెందిన శ్రీనివాసరెడ్డికి స్వగ్రామంలో ఆస్తి వివాదాలు ఉండడంతో అనంతపురానికి వలస వచ్చి మారుతీనగర్‌లో స్థిరపడ్డాడు. శనివారం రాత్రి భోజనం చేసి ఇంటి ఎదుట వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ఓ కత్తి శ్రీనివాసరెడ్డి శరీరంలో చిక్కుకుపోయింది. భార్య అరుణ అక్కడకు చేరుకునేలోపు దుండగులు పారిపోయారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆయనను సర్వజనాస్పత్రికి తరలించారు. వీపునుంచి ఛాతీలోకి కత్తి దూసుకు పోవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

రూ.12 లక్షల వసూలు

అనంతపురం క్రైం: నగరంలో ఇంటి, నీటి పన్ను రూ.12 లక్షలు వసూలైంది. శనివారం సెలవు దినం రోజైనా నగరపాలక సంస్థలోని పలు కౌంటర్లు, పాతూరు, రెండో రోడ్డు, రాం నగర్ సచివాలయాల్లో పన్ను బకాయి కట్టించు కున్నారు. ఆదివారం కూడా పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు తెలిపారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వరకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి వేయించాలని జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఇన్‌చార్జ్ సుజాత తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరైన పోషకాహారం ఇవ్వకపోవడం వల్ల పిల్లల్లో ఎదుగుదల ఉండదన్నారు. ప్రస్తుతం వేసవి జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, ఏఎన్ఎం అలివేలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా


పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: సింగంపల్లి తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సామ్లానాయక్ భార్య పార్వతమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీనియర్ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి సింగంపల్లి తండాకు వెళ్లి పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వేడుకలకు హాజరై విజయవంతం చేయాలన్నారు.

14న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భానురేఖ

కనగానపల్లి: ఈ నెల 14న అన్ని పాఠశాలలు, కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రలు పంపిణీపై అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఇందుకోసం మండలంలోని 53 అంగన్‌వాడీ కేంద్రాలు, 47 ప్రభుత్వ, 5 ప్రైవేట్ పాఠశాలలోని మొత్తం వంద కేంద్రాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు మాత్రలు వేయిస్తున్నామన్నారు. ఆ రోజు పాఠశాలలకు రానివారికి తిరిగి ఈనెల 18న మాత్రలు వేయించాలన్నారు. ఈ సమావేశంలో సీహెచ్ఓ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న అధికారులు

రాప్తాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం ఉదయం విజిలెన్స్ సీఐ రామారావు, డీసీటీఓ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ గోపీనాథ్, సిబ్బంది రాప్తాడు మండలం హంపాపురం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనంలో 34 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాహనాన్ని సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని రాప్తాడు స్టాక్ పాయింట్‌కు తరలించారు. బియ్యం తరలిస్తూ పట్టుబడిన చిన్మయనగర్ నివాసి జోగి వెంకట్రాముడు, అనంతపురంలోని టీవీ టవర్ ప్రాంతానికి చెందిన హరి, కురుబ మాధవి, బొలెరో డ్రైవర్ హర్షవర్ధన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

మొదటి రోజు ఇస్తెమా విజయవంతం


నమాజు చేస్తున్న ఖాజీ సాబ్


భోజనాలు చేస్తున్న ముస్లింలు

నగర శివారులోని ఆటోనగర్‌లో శనివారం జరిగిన ఇస్తెమా మొదటి రోజు విజయవంతమైంది. వివిధ జిల్లాలకు చెందిన ముస్లింలు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. ఇస్తెమాలో నగర మేయర్ వసీం పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన మౌలానా సయ్యద్‌సాబ్‌ను ఆయన కలిసి ప్రత్యేక ప్రార్థనలకు ఆహ్వానించారు. లక్షలాదిగా ముస్లింలు పాల్గొనడం చాలా గర్వకారణమని మేయర్ వసీం అన్నారు. ఆదివారం ఇస్తెమాకు అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వలంటీర్లు సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


నమాజుకు సిద్ధమవుతున్న ముస్లింలు


ఇస్తెమా వద్ద భోజనాలు చేస్తున్న ముస్లింలు


ఇస్తెమాలో ప్రత్యేకంగా నమాజు చేస్తున్న ముస్లింలు


రాప్తాడులోని ఆటోనగర్‌లో ఇస్తెమాకు తరలివస్తున్న ముస్లింలు


ప్రత్యేక నమాజులో...


మౌలానా సయ్యద్‌సాబ్‌తో కరచాలనం చేస్తున్న మేయర్ వసీం

సీఎంపై నోరుపారేసుకుంటే ఊరుకోం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిపై మేయర్ వసీం ఫైర్


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నోరుపారేసుకుంటే ఊరుకునేది లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిపై మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జిల్లాకు వచ్చిన అచ్చెం నాయుడు సీఎంపై చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను 98.4 శాతం పథకాలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగంలోని విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నారన్నారు. తద్వారా ఇంకా లక్షలాది మందికి ఉపాధి చేకూరుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దిగజారుడు రాజకీయం : టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మేయర్ మండిపడ్డారు. ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉండదన్నారు. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగూ గెలవలేమని, పీడీఎఫ్‌కు మద్దతిస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేమని మీకే నమ్మకం లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. దేశ రాజకీయాల్లోనూ తెలుగుదేశం పార్టీ క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని, గతంలో మీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రగల్భాలు పలికేవారన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి విజయం తథ్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, బాబాఫక్రుద్దీన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకుడు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



మాజీ అడిషినల్ పీపీ పద్మ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: నేటి సమాజంలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు లేనిదే సమాజం లేదని మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే పద్మ నారాయణరెడ్డి అన్నారు. శనివారం హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పద్మ నారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాదని, ప్రపంచంలో మహిళా శక్తికి మించిన శక్తి మరొకటిలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. అనంతరం ఆమెను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాల విద్యార్థినులకు మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బీవీ కృష్ణా రెడ్డి, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ రంజిత, కళాశాల సీఈఓ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఏమ్మా.. అమ్మాయి ఎలా చదువుతోంది?

- చదివే సమయంలో టీవీలు పెట్టొద్దు
- 'నైట్ విజన్'లో డీఈఓ సాయిరాం ఆరా


విద్యార్థిని ఇంటివద్ద పుస్తకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సాయిరాం

రాప్తాడురూరల్: ఏమ్మా...మీ పాప ఇంటివద్ద ఎలా చదువుతోంది.. చదివేటప్పుడు టీవీ పెట్టడం లేదు కదా?, సెల్‌ఫోన్ చేతికి ఇవ్వలేదు కదా? అని జిల్లా విద్యాధికారి ఎం.సాయిరాం పదో తరగతి విద్యార్థుల ఇళ్లవద్దకు వెళ్లి తల్లిదండ్రులను ఆరా తీశారు. 'నైట్ విజన్' కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి నగర శివారు ప్రాంతంలోని రుద్రంపేటలో పర్యటించారు. పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరాతీశారు. ఇంటి వద్ద విద్యార్థులు ఎలా చదువుతున్నారని ఆరాతీశారు. విద్యార్థుల వర్కుబుక్కు, నోటు పుస్తకాలను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని.. విద్యార్థుల సన్నద్ధతపై తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇంట్లో పిల్లలు చదువుకునేలా వాతావరణం కల్పించాలన్నారు. 8వ తరగతి విద్యార్థులు బై జ్యూస్ ట్యాబ్‌లు వినియోగిస్తున్నారా? లేదా? అని తెలుసుకున్నారు.

ఏం తమాషాగా ఉందా?

విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించని ఉపాధ్యాయులపై డీఈఓ మండిపడ్డారు. ఒక ఉపాధ్యాయురాలికి ఫోన్ చేసి...వర్క్ బుక్ పరిశీలించలేదా ? అని ప్రశ్నించగా, ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సీరియస్ అయ్యారు. ఏం తమాషాగా ఉందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో టీచరు కూడా ఇలానే నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డీఈఓ వారిద్దరికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, ఎంఈఓ వెంకటస్వామి, హెచ్ఎం ఉషారాణి, టీచర్లు ఉన్నారు.

ముగిసిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం


ప్రథమ స్థానంలో నిలిచిన విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెంట్రల్ స్థాయి క్విజ్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో విభిన్న ప్రతిభావంతుల సెక్టార్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ద్వితీయ స్థానంలో తాడిపత్రి ఏరియా విద్యార్థులు, తృతీయ స్థానంలో నల్లచెరువు ఏరియా విద్యార్థులు నిలిచారు. క్విజ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీతత్వ ప్రపంచంలో గ్రామీణ విద్యార్థులను తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్‌లో ప్రతిభ కనబరచడం హర్షించదగ్గ విషయమన్నారు. పోటీల్లో అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, ఒంగోలు జిల్లాల్లోని పిల్లలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల సరఫరాకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున గల అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగే శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన కిరాణా, పూజ, ప్రసాదం సరుకుల సరఫరా, లైటింగ్ డెకరేషన్, షామియానాల ఏర్పాటు కోసం కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆలయ ఈఓ మతం మల్లికార్జున ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 19లోగా తమ కొటేషన్లను ఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

16న ఆలయ హుండీ కానుకల లెక్కింపు : శ్రీకోదండరామస్వామి ఆలయంలోని హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీ ఉదయం నిర్వహిస్తున్నట్లు ఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగే లెక్కింపులో భక్తాదులు పాల్గొనవచ్చని తెలియజేశారు.

ఘనంగా వ్యాసరాజుల ఆరాధన ఉత్సవం


సర్వాంగ సుందరంగా అలంకరించిన రాఘవేంద్ర, వ్యాసరాజ బృందావనం


తీర్థ ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: దేశవ్యాప్తంగా హైందవ ధర్మ పరిరక్షణ కోసం జన చైతన్యం తెచ్చిన మహనీయులు వ్యాసరాజస్వామి 484వ ఆరాధనోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్థానిక పాతూరు చిన్నాంజనేయస్వామి ఆలయంలో వివిధ దేవతామూర్తులను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, ఆరాధనోత్సవం నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పారాయణం, పంచామృతాభిషేకం అనంతరం బెంగళూరు నుంచి వచ్చిన పండితులు ప్రవచనం చేశారు. వ్యాసరాజ తీర్థుల జీవిత విశేషాలను తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రతినిధులు రఘుస్వామి నేతృత్వంలో భజన, స్వస్తివచనం, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

రాప్తాడురూరల్: ఏపీ ఎస్‌బీటీఈటీ (సాంకేతిక విద్యాశాఖ) ద్వారా నిర్వహించనున్న సర్టిఫికెట్ కంప్యూటర్ కోర్సులు, క్రాఫ్ట్ కోర్సుల దరఖాస్తు గడువు ఈనెల 13 వరకు పొడిగించినట్లు సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు యర్రగుంట ఓబిరెడ్డి, యర్రగుంట గజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ కోర్సులు ఆఫీస్ ఆటోమేషన్, ఆటోక్యాడ్, పీసీ మెయింటెనెన్స్, వెబ్ డిజైనింగ్, మల్టీ మీడియా విత్ యానిమేషన్, క్రాఫ్ట్ కోర్సులు యోగా, అడ్వాన్స్‌డ్ యోగా, ఇంటీరియల్ డిజైనింగ్, ఫ్యాషన్‌డిజైనింగ్ అండ్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు సెల్: 90597 23829లో సంప్రదించాలని కోరారు.

ముందు జాగ్రత్తలతో మలేరియా అరికట్టొచ్చు


బాలుర హాస్టల్‌లో మందును పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

కూడేరు: ముందు జాగ్రత్తలు పాటిస్తే మలేరియాని అరికట్టొచ్చని జిల్లా మలేరియా అధికారి ఓబులు అన్నారు. శనివారం ఆయన కూడేరులోని బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా మలాథియన్ మందును పిచికారీ చేయించారు. వసతి గృహ పరిసరాల్లో నీటి నిలువలు, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని వార్డెన్లు గురుప్రసాద్, మాధవికి సూచించారు. అనంతరం ఆయన మండలంలోని అరవకూరు, లెప్రసీ కాలనీలో పర్యటించి వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పుట్టినప్పటి నుంచి 5 సంవత్సరాల వరకూ తప్పనిసరిగా నిర్ణయించిన మేరకు టీకాలు వేయించాలని, అపుడే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారినపడకుండా రక్షణ పొందవచ్చన్నారు. సీహెచ్ఓ మోహన్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్ బాషా, రవీంద్ర, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు జయమ్మ, రాణి పాల్గొన్నారు.

జీవాల్లో బ్రీడ్ సర్వే

బెళుగుప్ప: మండలంలోని హనిమిరెడ్డిపల్లిలో పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జి.వెంకటేష్ అధ్వర్యంలో మండల పశువైద్యాధికారి రమేష్ బ్రీడ్ సర్వే శనివారం నిర్వహించారు. ఉపసంచాలకుడు మాట్లాడుతూ బ్రీడ్ సర్వేను బెళుగుప్పలో ప్రయోగాత్మకంగా చేపడుతున్నామన్నారు. గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ అందించి కృత్రిమ గర్భధారణ చేపడతామన్నారు. మేలు జాతిని అభివృద్ధి చేసే దిశగా కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్ అందిస్తున్నామన్నారు.

భలే భలే.. బుల్లి బైక్!


రయ్..రయ్

విధులకు వెళ్లాలన్నా.. గమ్యస్థానాలకు చేరాలన్నా.. ఇంటి అవసరాలు తీర్చాలన్నా వాహన వినియోగం అనివార్యమైంది. వయసుతో నిమిత్తం లేకుండా ఏ చిన్న పనికైనా ఇల్లు విడిస్తే వాహనం ఉండాల్సిందే. ఇంధన ధరలు పెరుగుతున్న కొద్దీ విద్యుత్ వాహనాల వాడకంపై మోజు పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ పేరిట ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగం పెరిగింది. అనంతపురం నగరంలో చిన్న పిల్లలతో పాటు మహిళలు, వృద్ధులు ప్రత్యేకంగా తయారైన బుల్లి బైక్‌లపై ఇలా విహరిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం :




పార్కులో వినియోగంలో లేని ఆటవస్తువులు

ఆహ్లాదం.. ఆదమరిచిన అధికారులు

నగరవాసులు, చిన్నారులకు ఆహ్లాదం, వినోదం పంచుతున్న పార్కులను నిర్వహించాల్సిన అధికారులు.. ఆదమరిచారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పార్కుల అభివృద్ధికి కృషి చేస్తోంది. అయితే ఎప్పటికప్పుడు పార్కుల్లో పచ్చదనం పెంచుతూ, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. దీనికితోడు నగరపాలక సంస్థ ఎన్విరాన్‌మెంట్ ఉన్నతాధికారి బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో పార్కులు శిథిలావస్థకు చేరుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్ష్మీనగర్‌లోని జన్మభూమి చిల్డ్రన్స్ పార్కు దుస్థితికి చేరడమే ఇందుకు నిదర్శనం. అధికారులు ఇప్పటికైనా మేల్కొని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం